# బైనాకులర్

మొన్న నొక కథలో వ్రాసినప్పుడు డీసెల్‌కార్ బహూ తొడతొక్కిడి బండి అని చెడతిట్టి పారేశాను. గాని అన్నిప్పుడూ అలా వుండదు. అందులోనూ అది స్టార్టు అయ్యేచోట కొవ్వూర్లో గనక అందఱికంటె ముందు మనం ఎక్కి కూర్చున్నామా మనదే బండి అంతా—మఱిన్ని తెల్లాఱుగట్ల శీతకట్టున అయితే నిశ్శబ్దత ప్రశాంతతకూడా ఆ ఒంటిపాటుకు బాగా తోడ్పాటు అవుతాయి. కాళ్లకంటా శాలువ ముసుగెట్టుకుని పడుక్కున్నాను, నలుగురు కూర్చోవలసినబల్ల నే నొక్కణ్ణే ఆక్రమించి.

మఱి రాజమండ్రిస్టేషను దాకా ఱెప్ప విప్పలేదు. కాలు కదపలేదు.

అక్కడ కొన్ని ట్రంకులు! కొంత బెడ్డింగు! కుసింత కోలాహలం! ఇద్దరు ముద్దుగుమ్మలు ఎక్కారు బండిలోకి. ముద్దుగుమ్మలనడానికి నాకు అప్పటికి దొరికిన ఆధారం వారి కంఠధ్వని వొక్కటే అనుకోండి!

రాజాలు, రత్నాలు వాళ్ళిద్దరి పేళ్లూను. ఈ సంగతి తరువాత ఎవరినో అడిగి తెలుసుకున్న విషయం. అందు నా ఊహా ప్రబోధం ఏమీలేదు.

రాజాలంటుంది రత్నాల్తో 'కమ్ హియర్! దిస్ ఈజ్ ఎ నైస్ కార్నర్' రత్నాలు 'ఓ! ది హోల్ ఈజ్ వేకెంట్' లేచి కూర్చున్నాను. 'ఏదో కాస్త విద్యాగంధంవున్న వీరకన్యల్లా ఉన్నారు వీరెవరా?' అని ఆశ్చర్యపోతూ. వారున్నా అలా

అలా ట్రంకులులాక్కుని బెడ్డింగులు మోసికొని ఏలాగైతేం నా వైపునకే, నేను గూర్చున్న కానులోకే నా బల్ల కెదురుగా నున్న బల్లమీదకే చేరుకున్నారు. చేరుకుని ఎవరిచీర కుచ్చెళ్లు వారి కాలివేళ్లు పూర్తిగా మూసేలా సవరించుకుంటూ స్థిమిత పడ్డారు. నా శాలువ నేనూ ఏదో జవాబుగా సర్దుకున్నాను.

రాజాలంటుంది రత్నాల్తో 'నిజంగా నిన్నను ఆ సమయాన్ని గనుక మనదగ్గఱ బైనాకులర్ ఉంది ఉంటే—' రత్నాలు 'గట్టుమీది పువ్వులు మగపువ్వులో ఆడపువ్వులో చెప్పేసి ఉందును' రాజాలు "నా 'సబ్జెక్టు' 'బోటనీ' కాదో!" రత్నాలు "ఏమిటి బి. ఎ. లోనీ 'సబ్జెక్టు'?" రాజాలు 'ఇక్నోమిక్సు' రత్నాలు 'ఐ. సి.'

గ్రాడ్యుయేటెడ్డు కన్యలు అని కూడా నేను నిర్ధారించుకున్నాను. నా శాలువ పూర్తిగా తీసివేసి నాలుగుమడతలుపెట్టి 'హోల్డు ఆల్' మీద పడేసి నా నిజస్వరూపం లోకానికి వెల్లడి బఱిచాను. లోకంఅంటే అప్పటిమట్టుకు ఆ యిరువురూ నేనూ కూర్చున్న ఆ రెండు బెంచీల పట్టూను. ఆడా మగా వివక్షత తప్ప మఱి 'డిష్టిక్షన్లు' గాని 'డైమెన్షన్లు' గాని లేవు ఆ లోకంలో.

నా 'సూట్' నా 'టై' నా 'కర్చీఫ్' నా నీటు నా తేటు అంతా తేరిపారి ఓ పర్యాయం చూస్తూ ఆ యిద్దరుకూడా ఒకరి ముఖాలు వొకరు చూచుకుంటూ నాలుగుకళ్ల చూపుల్ని నాలుగు దిక్కులకూ చెదరించి ముఖాలు చిట్లించుకున్నట్లు అభినయించారు.

నేను నా జేబులోని 'బైనాకులరు' తీసి దానిగుండా అలా 'సౌత్‌వెస్టు'కు చూస్తున్నాను. దిఙ్మండలప్రాంతం. సూర్యోదయాత్పూర్వపు శోభలు 'వెరీ బ్యూటిఫుల్'గా వెలిసిపోతున్నాయి. గాలి చలిచలిగా వీస్తూవుంది. అయినా కలువకులేని

చలి నా కేమిటని రైలురోడ్డుపక్కనవున్న పడియలలోని పువ్వుల వంకకూడా 'బైనాకులర్' తీసివేసి మధ్యమధ్య చూస్తూ వచ్చాను, కిటికీరెక్క యింకా యింకా ఎత్తివేస్తూ. అక్కడక్కడ పల్లెటూళ్ళయొక్క నాటితొలియులివువింటూ 'డిసెల్' ఎంత వడిగా పోతూవుంది! అని మెచ్చాను వాళ్లువినేలాగు:

ఇరువురిలో ఒకామె ఎవరో—ఇప్పుడు నేను పేరు చెప్పలేను—"ఆ 'బైనాకులరు' ఒక పర్యాయం ఇలా దయచేసి యిప్పిస్తారా?" అని అడిగింది. బైనాకులరుమాత్రమే ఇస్తే చాలదు అని నేను బాగాగ్రహించి, ఆమెకు బైనాకులరుతోపాటు నా సీటుకూడా ఇచ్చి మరోబల్లమీద కూర్చున్నాను.

బైనాకులరుగుండా ఆమె చూడ్డం సాగిస్తూ "రత్నాలు 'వండర్‌ఫుల్ వ్యూ'! వీటిగుండా! 'రియల్లీ'! ఇది నిన్నను మనవద్ద వుండివుండవలసింది. మనం మన 'ఎక్సెకర్షన్' 'ఎక్సలెంటు'గా 'ఎంజోయ్' చేసివుందుము" అంది. ఎవరో అంటా అగాలని? రాజాలు! జ్ఞాపకం వచ్చింది ఇప్పుడు ఆమె పేరు:"

రత్నాలు 'ఈవెన్ దెన్ ది ఫెలో కుడ్ నాట్ బి సీన్. అప్పుడైనా అతగాడు మనకు అదృశ్యుడే. అక్కడవుంటేగా ఆ చుట్టుపట్లగాని ఆ గట్టుమీదగాని ఆ చెట్లచాటునగాని అసలుంటేగా? వెతికివెతికి వేసారి వెళ్ళిపోయినాము జ్ఞాపకం వుందో లేదో నీకు. అతడు మనలైనా తప్పిపోయివుండాలి మనం అతన్నయినా తప్పిపోయి వుండాలి' అంది. రాజాలు 'ఎ గుడ్ కన్వర్సేషనిలిస్టు! ఎ జోలీ ఫెలో! ఎ లవర్ ఆఫ్ నేచర్ సెంటు పెర్ సెంటు హ్యూమన్ హార్టు.

"ఎవరతడు? ఏమిటి గొడవ?" అని అడిగితే ఎటికెట్‌కు లోపమేమో అని ప్రశ్న ఆలా ఉగ్గబట్టుకూర్చున్నాను.

రాజాలు వెంటనే నా 'బైనాకులరు' తన ఎడంతొడమీద ఆలా వుంచుకుని, జారిపడిపోకుండా తన కుడిచేయి దానిమీద ఆంచిందై రత్నాలుతో అంటుంది. 'మనం నిన్న పయనించిన ప్రవాహం రసప్రవాహం! మన నావ ప్రదక్షిణచేసిన లంకలు భూలోకస్వర్గాలు. పైని మేఘాలు ఏలా అవకతవక ఆకారాలు దాల్చివున్నా అందం అని అనిపిస్తాయో, యీ గోదావరి లంక లున్నూ ఆలాగే వంకరటింకరవైనా సౌందర్యం ప్రకటిస్తాయి. ఇంకో విశేషమేమిటంటే మేఘాలమధ్య చంద్రుడు మేఘాల్ని తప్పించుకు తిరుగలేడు. మేఘాల్లో దూరిపోతూవుంటాడు. కాని మననావ అలాకాదు. లంకల్ని తప్పించుకుని వాటిని చుట్టేసు కుని దానిదే మహాస్వతంత్రం అన్నట్టు నడిచింది.'

ఆలా రాజాలు లెక్చర్ దంచుతూవుంటే రత్నాలు "ఏదీ 'బైనాకులరు' అన్నట్టు తన కుడిచేత్తో రాజాలుయొక్క కుడిచేయి తప్పిస్తూ అడక్కుండానే అందుకుంది." రాజాలు 'అక్కణ్ణుంచి కాదు చూడ్డం. ఇక్కణ్ణుంచి చూడాలి' అంది. అంటూ వాళ్లిరు వురూ అన్యోన్యం సీటులు మార్చుకున్నారు.

రత్నాలు బైనాకులరుతో తన కలవడిన వేవో చూస్తూ 'సూర్యోదయం అవుతూవుంది చూడు! ఎంత గ్రాండుగావుందో!' అంది. నేను కొంచెం ముందుకు వంగాను.

రాజాలు 'ఆయనకూడా చూస్తారులాగుంది ఇచ్చేసెయ్యి! ఆయందేగా అసలు ఆ బైనాకులరు' అంది.

"అక్కర్లేదు. మీ దగ్గర్నే ఉంచుకోవచ్చును' అన్నాను, ఎందుకో ప్లీస్ అయి.

నిలువునాలేచి రెండోవెంపు కిటికీలోంచి తొంగిచూచాను. ఆదాకా 'సౌవెస్టు'న కనబడ్డ సూర్యబింబం. 'సౌతీస్టు'న కనబడ సాగింది. రైలుగట్టుకు పెద్దవంపు ఉంది కామోసు!

వెనకమంచి 'థాంక్ యూ సర్ ! హియర్ ప్లీస్, యువర్ బైనాకులర్' అని బైనాకులరు బల్లమీదవెట్టి ఆ యిరువురు వాళ్ళ ట్రంకులు బల్లల క్రిందినుంచి లాక్కుంటూవున్నారు.

నేను నా బైనాకులరు తిరిగి తీసికొంటూ ఆలా దాని గుండా డిస్టెన్సు ఎడ్జెస్టు చేసుకుంటూ వాళ్ళ తలకట్లు తిలకించాను.

రాజాలు రత్నాలు ఇద్దరూకూడా ఎవరికి వీలుగావున్న పక్కనుంచి వారి పక్కచూపులు నాప్రక్కకు విసిరారు.

"యు కెన్ హేవ్ దిన్ ఇఫ్ యు లైక్" అని బైనాకులర్ వెంటనే ఇద్దరకూ అందియ్యబోయి ఇద్దరి మధ్యనూ జారవిడిచాను.

దాని అద్దాలేమయినా యీూ పగిలిపోయాయో యేమో అన్న సంగతి విచారించకుండానే ఇద్దఱూ ఏకకంఠంగా 'వెరీసారీ' అన్నారు. నేను 'నోమేటర్స్ లిటిల్ ! ఐ యాం గోయింగు టు వార్' అన్నాను. 'ఆన్ టు ది పోర్టు ఎ బోర్డు ది షిప్ !' అని కూడా ఏడ్ చేశాను.

"బైనాకులర్" పడిపోయింది పైకెత్తి వారిద్దరూ "ఇఫ్ టు వార్ ! అన్ టు ది పోర్టు ! ఎ బోర్డు ది షిప్ ! మీదగ్గరే వుండాలి ఇది" అన్నారు. అలాకాదు మీదగ్గరేన్నే వుంచాలి. అన్నాను.

నేను వోడెక్కాను. వాళ్లు వొడ్డునుంచి బైనాకులరుతో నన్నూ నావోడనూ చూస్తూ "వొ. కె." అన్నారు.

నేనే ఆ "ఎ గుడ్ కన్వర్సేషనలిస్టు ! ఎ జోలీఫెలో ! ఎ లవర్ ఆఫ్ నేచర్ ! వెంటు పెర్సెంటు హ్యూమన్‌హార్టు" నైపోయినట్టు ఉప్పొంగిపోయినాను. ఉదధి ఉబ్బెత్తునా ఉప్పొంగి పోయినాను.